దంతో వెనుతిరిగి చూసాడు.

ఎదురుగా ఇన్స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్.

"ఓయ్-మిస్టర్. యువర్ నేమ్ ప్లీజ్" అడిగాడు ఇన్స్పెక్టర్.

"సత్యం" చెప్పాడు.

"ఏ ఊరు"

"ఈ ఊరే సార్"

"స్వంత ఇల్లుందా నీకు"

"ఉంది సార్"

"అయితే స్వంత ఇల్లుండగా పార్కులో కొచ్చి పడుకోవడానికి కారణం ఏమిటి" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఏం లేదుసార్! ఈ రోజుతోనే నా ఎగ్జామ్స్ అయిపోయాయి సార్. రిలాక్సింగ్ కోసం ఇక్కడికొచ్చి పడుకొన్నాను సార్" అన్నాడు సత్యం.

"నీ నాటకాలు నాకు తెలియవనుకున్నావా! నీకెంతమంది స్మగ్లింగ్ ముఠాలతో సంబంధముందో నాకు తెలుసు. ముందు స్టేషన్‌కిపద" అంటూ సత్యం ఎంత రిక్వెస్టు చేస్తున్నా వినకుండా స్టేషన్‌కి తీసుకుపోయి లాకప్‌లో పడేసాడు ఇన్స్పెక్టర్.

* * * *

లాకప్‌లో ఉన్న సత్యాన్ని తీసుకు రమ్మని ఇన్స్పెక్టర్ చెప్పడంతో, ఇన్స్పెక్టర్ గదిలోకి తీసుకునివెళ్ళాడు హెడ్ కానిస్టేబుల్ కనకయ్య.

తనదగ్గరకు వచ్చిన సత్యాన్ని చూపిస్తూ ఇన్స్పెక్టర్, అక్కడే కూర్చున్న దేవితో "ఏమ్మా! నిన్ను ప్రేమిస్తున్నట్లుగా ఉత్తరాలు రాసి, నీ పరువు తీస్తున్నది, పైగా కాలేజీలో కూడా నిన్ను ఎక్కువగా ఏడిపిస్తున్నది ఇతనేనా" అడిగాడు.

"ఇతనేసార్! ఇతను ప్రతిరోజూ కాలేజీలో నా వెంటపడుతూనే ఉంటాడు సార్, మళ్ళీ ఉత్తరాలు రాస్తూ, నానాఅల్లరి చేస్తున్నాడు" అంటూ సత్యం తనకి రాసిన ఉత్తరాలు తీసి చూపించింది దేవి.

దేవి చూపించిన ఉత్తరాలవి చూసిన ఇన్స్పెక్టర్ సత్యంతో "సత్యం! నువ్వు కాలేజీలో ఏడిపిస్తున్నట్లుగా ఉత్తరాలద్వారా తనని వేధిస్తున్నట్లుగా దేవి మాకు కంప్లైంట్ ఇచ్చింది. దేవి నిన్ను ఈ రోజు 6 గం॥ రమ్మంటూ ఉత్తరం రాసాననీ, నన్ను నీపై తగిన చర్య తీసుకోమని కోరింది. ఆమె సలహా ప్రకారమే నేను పార్క్‌కి వచ్చి నిన్ను అరెస్టుచేసాను. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని దేవికి క్షమార్పణ చెప్పు. లేకపోతే మీ ప్రిన్స్‌పాల్‌తో చెప్పి నిన్ను కాలేజీనుండి సస్పెండు చేయిస్తాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ మాటలకి భయపడిన సత్యం తప్పు క్షమించమంటూ దేవిని కోరాడు. ఇకెప్పుడు నిన్ను అల్లరిచేయనంటూ వాగ్దానం కూడా చేసాడు.

తనని సత్యం దారినుండి తప్పించినందుకు కృతజ్ఞతలు ఇన్స్పెక్టర్‌గారికి చెప్పి వెళ్ళిపోయింది దేవి.

వెళ్ళిపోయిన దేవి, వెనకాలే "కథ అడ్డం తిరిగింది" అనుకుంటూ స్టేషన్‌లోనుండి బయటపడ్డాడు సత్యం.

—ఇ.రామకృష్ణారావు
(విజయనగరం)

*స్రవంతి నెం: 15లో ఇచ్చిన*
"స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవడానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్ స్పెక్టర్ సత్యాన్ని.
వాక్యం ఆధారంగా రాసినకథలు.

## తీరని సమస్య

సత్యం ఉద్యోగరీత్యా చాలాకాలం నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతనికి సుమారు 48 సం॥లు వుంటాయి. చామన ఛాయ రంగు, గుమ్మడికాయ లాగ పొట్టిగా ఉంటాడు. గుండ్రని ముఖం. స్వంత ఇల్లు కూడా ఉంది అతనికి. సత్యానికి ఒకే ఒక్క కూతురు. తల్లి చిన్నప్పుడే పోవటంచేత చాలా గారాబంగా పెరిగింది. సుజాత. యుక్త వయస్సు వచ్చేసరికి మంచి పెళ్ళి సంబంధం చూసి మద్రాసులో ఉంటున్న సురేష్‌కి ఇచ్చి పెండ్లి జరిపించాడు. సుజాత అత్తవారింటికి వెళ్ళిపోయిన తరువాత ఇల్లు అంతా అద్దెకు ఇచ్చి తను ఒక్కడూ ఒక్క గదిలో ఉంటున్నాడు. సుజాత పెళ్ళి అయిన తరువాత మొదటి పెద్ద పండక్కి కూతురుని, అల్లుడిని రమ్మని ఉత్తరం వ్రాసాడు. కాని అతనికి దిగులు పట్టుకున్నది. అతను ఉంటున్నది ఒక్క గదిలో. కూతురు, అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటారు, వాళ్ళకి ఈ గది ఇస్తే తను ఎక్కడ పడుకోవాలి? అన్న ఆలోచనలతో బుర్రనిండిపోయింది. ఈ లోగా కూతురు, అల్లుడు రానే వచ్చారు. సత్యం నిరాడంబరంగా పండగ జరిపించాడు. కూతురిని, అల్లుడిని తన గదిలో పడుకోమని తన స్నేహితుని ఇంట్లో పడుకుంటానని చెప్పి రాత్రి 8-00 గం॥లకు భోజనం చేసి బయటకు వచ్చాడు. ఆ రాత్రి సెకండ్ షో చూసి దగ్గరలో ఉన్న పార్కుకు పోయి పడుకున్నాడు. రాత్రి 12 గం॥ కావటంతో కానిస్టేబుల్ సత్యాన్ని తీసుకుపోయి కటకటాల వెనక్కునెట్టాడు. తెల్లవారిన తరువాత ఇన్‌స్పెక్టరు సత్యాన్ని పిలిచి అడగగా తనకు స్వంత ఇల్లుకూడా ఉందని చెప్పాడు. "స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవటానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టరు సత్యాన్ని. దానికి జవాబుగా జరిగింది చెప్పి ఇంటికి చేరుకున్నాడు సత్యం— కానీ రెండో రాత్రి ఎక్కడ పడుకోవాలి అన్నదే అతనికి తీరని సమస్యయికూచుంది.

-ఎస్.ఎస్.వి.ఎస్.
ప్రకాశరావు
(అనంతపల్లి)

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

*"నీకు చెప్పడం ఇదే ఆఖరిసారి. మళ్ళీ ఇలాంటిది జరిగిందో వేరుగా ఉండటం ఖాయం" అంటూ భర్త గదిలోంచి విసవిసా వెళ్ళిపోయింది సుజాత.*